స్కెచ్

# మేలుకొలుపు

## యం. వై. రెడ్డి

"వాచ్‌మేన్....వాచ్‌మేన్...." కీచుగొంతు నిద్రావస్థలోనున్న గొంగళి పురుగులకు మేలుకొలుపు పాడింది

"ఆ! ఆ! వస్తున్నా సార్!" వినయ విధేయతలు తొణికిసలాడుతూన్న ఒక సన్నని గొంతు ప్రత్యుత్తరమిచ్చింది.

అయిదు రూపాయలు! ఎలా పోయాయి! పదినిమిషాల క్రిందటే స్నానానికి పోతూ టేబిల్ మీద పది రూపాయలనోటు, ఐదు రూపాయలనోటు పెట్టిపోయాడు వచ్చేటప్పటికే అయిదు రూపాయల నోటుకు రెక్కలు మొలుచుకొచ్చి ప్రయాణం కట్టింది ఈ పది నిమిషాల్లోపలే ఎవరు కొట్టేశారబ్బా? ఎంత ధైర్యం! ఉదయం ఏడు గంటలప్పుడు జనమంతా తిరుగుతూండగా, ధైర్యంగా రూములో జొరబడి అయిదు రూపాయలు కొట్టేయడమే! మరీ విచిత్రం! దాని క్రిందనేఉన్న పది రూపాయలనోటు సురక్షితంగా ఉంది స్నానానికి పోయేలోగా వాచ్‌మేన్ రూము ఊడవడానికి రాలేదు ఇప్పుడేమో శుభ్రంగా ఉంది! ఇదంతా, వాడిపనే! వాడు తప్ప ఇంకెవరు తీస్తారు? అంత ధైర్యం వేరేవాళ్ళకు ఉండదు!

"ఏమిటిసార్, పిలిచారు?" వినయంతో చేతులు ముడుచుకొని వచ్చిన వాచ్‌మేన్‌ను "పుండాకోర్! చెప్పు, ఎందుకు తీశావు అయిదు రూపాయలు?...లేకుంటే మక్కెలు విరగదన్నిస్తా! ఇంతపెద్ద హాస్టలుతో పట్టపగలు దొంగతనం చేయటానికి ఎన్ని గుండెలున్నాయిరా నీకు?" స్వాగత వచనాలు మేరు గంభీరంగా ఉన్నాయి

"ఏమిట్రా, అలా చూస్తావ్? పక్షవాతం వచ్చిందా, ఏం?" ఆశీర్వచనాలు పిడుగుల మాదిరి వర్షించాయి.

పిడుగుపాటుకు ఒక గొంగళి పురుగు దుప్పటిలోనుంచి ముక్కు బయటికిపెట్టి మూలిగింది "ఏమిట్రా! ఈవేళప్పుడు సరీగ్గా, నిద్ర పోనివ్వకుండా గొడవచేస్తారు? . ఇంతకూ టైమెంత అయింది?"

సీతాకోక చిలుక కాబోతూన్న ఇంకొక గొంగళి పురుగు కండ్లు దుప్పట్లోనుంచి బయటికిపెట్టి 'ఏడు' అని ప్రవచించింది

"భాయ్. ఇంకో గంటకు లేపు, మరచిపోయేవ్!" పురుగుముక్కు దుప్పట్లోకి చేరింది

"చెప్పరా రాస్కెల్ .. ఏం చేశావ్ ఆ డబ్బు?" వర్షం ఆగలేదు

గొంగళి పురుగుకు రక్కున మెలకువ వచ్చింది డబ్బుపోవడం అనే మాట అతని శ్రవణేంద్రియాల్లో పెను తుపాను లేపింది. పోవడం అనేమాట వినకూడదు పోయినదాన్ని మరల తేవల్సిందే! కాబోతూన్న ప్రఖ్యాత డిటెక్టివ్ అయిన తను ఈ గదిలో ఉండగా ఐదైనా పోవడమేమిటి? అబ్సర్డ్! ఆ మాటే గట్టిగా అనేశాడు

"నోరు మూసుకోరా! డబ్బుపోయి నే నేడుస్తూంటే నీ గోలేమిటి మధ్యలో!" సహాయానికి బదులు అడ్డంకి ఎదురయింది

దుప్పటి అవతల పారేసి గొంగళిపురుగు తన అభిమాన విశ్వవిఖ్యాత హిగిన్‌బాదమ్స్ డిటెక్టివ్‌లను తలుచుకొని కార్యరంగంలో దూకింది

"ఏమిట్రా, ఎంత పోయింది? ఎవరు తీశారు!"

"అది తెలియకనే కదుటోయ్ నే నేడుస్తూంట! ఎవరు తీశారో తెలిస్తే చెవులు మెలేసి వసూలు చేయనూ! ఎవరు తీశారో చెపితే నీవు పట్టుకొస్తావు కాబోలు....వహ్వా!"

బ్రతిమలాడి గొంగళిపురుగు జరిగిన సంగతి తెలుసుకుంది

"అవే థ్రం ది టేబుల్" అంటూ బాధితుణ్ణి పక్కకు తోసి టేబుల్‌ను సమీపించి క్లూకోసం వెతుకులాడ మొదలెట్టాడు

అంతలో రెండవ పురుగు సీతకోకచిలుకై విచారణ ప్రారంభించింది "రెడ్డొచ్చె మొదలెట్టు" అన్నట్లు మహత్తర విషయం రిలీజు చేయబడింది

టకప్‌చేసి బూట్లువేసి పడుకోకుంటే విద్యార్థిలోకానికే అవమానమని ఉద్బోధించే చిలుక, అధిక్షేపించింది "ఒరేయ్! నే చెపితే విన్నావ్? నిన్న హాయిగా సినిమాకు పోదామురా అంటే నాదగ్గర డబ్బుల్లేవు బాబో. చచ్చినా రానన్నావే! చావు . బాగా చావు దిమ్మ పట్టిందా! తిక్క కుదిరింది కదూ " సమయంలో సమయంగా బాణాలు వదిలాడు

ఇంతలో డిటెక్టివ్ పురుగు అరిచింది, "ఓ నా దేవుడా! క్లూ దొరికింది. ..ఇలారా రా.... ఇటు చూడు—ఇక్కడేం అగపడుతోంది?"

"నీ మొఖం!"

"సరేలే! నీకేమి తెలుస్తుందిరా! పది రూపాయల నోటు కిందనే ఉంది, ఐదు రూపాయల నోటు లేచిపోయింది!"

"ఏడిచావ్! ఆసంగతి తెలుస్తూనే వుందిగా"

"ఉండరా - ఇటు చూడు! పదిరూపాయల నోటు నలిగిపోయి ఉంది ఇటు టేబుల్‌మీద చూడు ఏముందో! "

"ఏముందా? పది రూపాయల నోటుతో పాటు నీ ఏడుపు మొఖం!"

"అంతేరా నాయనా, అంతే! ఇటుచూడు. బాగా చూడు—జాగ్రత్తగా. ..టేబుల్‌ను తాకకు! టేబుల్‌మీద ఇసుక ఉంది ఎలాటి ఇసుక? గది నేలమీదఉండే ఇసుకలాటిది." అంటూ నేలమీద ఇసుక తీసి వాసనచూసి భుజాలు ఎగరేశాడు "ఏమైనా అర్థమయిందిరా నీకు?"

"అర్థంలేదు, పర్థంలేదు... నీ తెలివితక్కువతనంమాత్రం అర్థమైంది "

"ఎందుకు బ్రదర్ అట్లా ఆశీర్వదిస్తావ్? ఈ ఇసుక ఏం తెలుపుతూందో తెలుసా?.... సరిగ్గా విను ... ఈ దొంగతనం ఎలా జరిగిందంటే....నీవు స్నానానికిపోయిన మరుక్షణం లోనే వాచ్‌మేన్ రూములో ప్రవేశించాడు. యథాప్రకారంగా ఊడ్చుకొస్తున్నాడు ఇంకేముందీ, నోట్లు కళ్ళబడి ఉంటయి అర్థమయిందా ఇప్పుడైనా . ."

ఆవాదనకు ముగ్ధుడైపోయాడు బాధితుడు. ఆ వాదన ఎంత పటిష్ఠంగా ఉంది! అనుమానం లేదు! వీడే....వీడే ...ఈ వాచ్‌మేనే తీశాడు!

"చెప్పరా వెధవా! తీశావా లేదా?" చెంప ఛెళ్ళుమంది

వాచ్‌మేన్ కంఠం అశ్రువులతో పూడుకుపోయి మూగవోయింది

"ఈ విషయం వార్డెన్‌కు రిపోర్టు చేస్తాను. ఉద్యోగం కాస్త ఊడిపోతుంది!" అనునయవాక్యాలు దద్దరిల్ల చేశాయి

"చెప్పకండి బాబూ! నా ఉద్యోగం పోతుంది! నేను తీయలేదు బాబూ! వార్డెన్ కర్కోటకుడు . న్యాయా న్యాయాలు చూడకుండా ప్రవర్తిస్తాడు బాబూ! కనికరించండి బాబూ . "వాచ్‌మేన్ గళం హృదయ విదారకంగా పలికింది

"ఏయ్! నీ వాగుడువల్ల లాభంలేదు! వార్డెనుకు చెపుతానంటే ఎందుకలా బయపడ్డావ్? దొంగిలించావు కనక!. ..ఇస్తావా. లేదా?" వాచ్‌మేన్ రెండవ చెంపకు బలం వచ్చింది

ఆ మరుక్షణంలో రూములో అడుగుపెట్టిన పక్కరూమువాడు అన్నాడు "బ్రదర్! నీకో విషయం చెప్పాలి—ఇందాక నీవు స్నానానికి పోయిన సమయంలో, నా రూముమేటు వూరికి పోతూ డబ్బు తక్కువయిందని అంటే నిన్ను అడిగి పట్టుకొస్తానని వచ్చాను వచ్చే టప్పటికి నీవు లేవు టేబిల్‌మీద 15 రూపాయలు అగుపడితే, నీకు తరువాత చెప్పవచ్చులే అని, అయిదు రూపాయలు పట్టుకెళ్ళా!"

ఆ దెబ్బకు ప్రఖ్యాత 'డిటెక్టివ్' గొంగళిపురుగు, మంచం విరిగిపోయే తీవ్రతలో కూల బడింది! ★